క్లుప్తంగా

బాధితులను పరామర్శించిన ఎమ్మెల్సీ



ఉండవెల్లి: మండలంలోని ఇటిక్యాలపాడులో పది రోజుల క్రితం మృతిచెందిన గౌరెడ్డి కేశవరెడ్డి కుటుంబ సభ్యులను, నాగిరెడ్డి కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి పరామర్శించారు. కార్యక్రమంలో హరిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని కోయిల్ దిన్నె గ్రామ మాజీ సర్పంచ్ పుల్లారెడ్డిని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి పరామర్శించారు. ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం చేయకుండా తరచూ డాక్టర్లను సంప్రదించాలని, త్వరగా కోలుకోవాలని ఎమ్మెల్సీ కోరారు. ఎమ్మెల్సీ వెంట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

అయిజ: నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరం సరఫరా చేసేందుకు చేపట్టిన మరమ్మతు పనుల్లో భాగంగా సోమవారం ఉదయం 6:30 గంటల నుంచి 8:30 గంటల వరకు అయిజ, గట్టు మండలాల్లో కొన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏడీఈ నీలి గోవిందు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ తొత్తినోనిదొడ్డి సబ్ స్టేషన్‌లో ఏబీ స్విచ్‌కు మరమ్మతులు, చిన్న తాండ్రపాడు సబ్‌స్టేషన్ పరిధిలోని తుపత్రాల, కేశవరం ఫీడర్లలో అదనపు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని 33/11 కేవీ తొత్తినోనిదొడ్డి, చిన్న తాండ్రపాడు సబ్‌స్టేషన్ పరిధిలోని చిన్న తాండ్రపాడు, కేవవరం, వేణిసోంపురం, తుపత్రాల, మేడికొండ గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఏడీఈ తెలిపారు. గట్టు మండలంలోని ఇందువాసి సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు కూడా రెండు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ నరేందర్‌రెడ్డి కోరారు.

మల్దకల్: మండలంలోని బూడిదపాడు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, ఇతర పనుల కారణంగా సోమవారం ఉదయం 7గంటల నుంచి 9గంటల వరకు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఆయా గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అయిజ ఏడీఈ గోవిందు, మల్దకల్ ఏఈ దుర్గప్రసాద్‌లు తెలిపారు. ఈ విషయాన్ని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు గమనించి విద్యుత్ అధికారులకు సహకరించాలని వారు కోరారు.

విద్యుత్ అంతరాయంతో ఇబ్బందులు

మానవపాడు: మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం పలుమార్లు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. విద్యుత్ అంతరాయం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మండల కేంద్రంలో ఎండతీవ్రత దాదాపు 44 డిగ్రీలకు పైగా ఉండటంతో ఉక్కపోత వల్ల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ ఎందుకు అంతరాయం కలుగుతుందో తెలియని పరిస్థితి. శనివారం కలెక్టర్ సంతోష్ వారం రోజులు 44డిగ్రీలకు పైగా ఎండలు ఉంటాయని ప్రకటన చేశారు. అయినా విద్యుత్ అధికారులు నిర్లక్ష్యంతో విద్యుత్ అంతరాయం ఏర్పడి ప్రజలకు ఇబ్బందులు కల్పించారు. దీనిపై విద్యుత్ అధికారి ఏఈ సతార్‌మియ్యను వివరణ కోరగా టెక్నికల్ ఇబ్బందులున్నాయని పేర్కొన్నారు.

సమావేశం జయప్రదం చేయండి

గద్వాల అర్బన్: 'వనపర్తిలో పార్లమెంట్ ఎన్నికలు సీపీఎం' అనే అంశంపై సోమవారం నాగర్‌కర్నూల్ పార్లమెంటరీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీరయ్య, కార్యవర్గ సభ్యుడు జాన్‌వేస్లీ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని సీపీఎం కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

వాహనాల తనిఖీ

కేటీదొడ్డి: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని నందిన్నె చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ ఎక్సైజ్ సీఐ మొగిల్‌నాయక్, ఎన్నికల అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనాల్లో పెద్ద ఎత్తున నగదు మద్యం, సారా తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరైనా రూ.50 వేల కంటే ఎక్కువ నగదు తీసుకెళ్లేటప్పుడు వాటికి సంబంధించిన రశీదులను చూపించాల్సి ఉంటుందని తెలిపారు. తనిఖీలో ఎస్ఎస్‌టీం తదితరులు ఉన్నారు.

మానవపాడు: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రంలోని అమరవాయి, చెన్నిపాడు, నారాయణపురం, మానవపాడు స్టేజీల వద్ద వాహనాల తనిఖీ నిర్వహించినట్లు ఎస్ఐ చంద్రకాంత్ తెలిపారు. రూ. 50వేలకు మించి నగదు తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మద్యాన్ని బెల్ట్‌షాపుల్లో అమ్మినా కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

ఎల్లమ్మ విగ్రహాల ప్రతిష్ఠాపన

నర్వ: మండల కేంద్రంలో ఎల్లమ్మ దేవర్ల నూతన విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక హరిజన వాడ లో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఎల్లమ్మ దేవత విగ్రహాలను అర్చకుల వేదమంత్రోచ్ఛరణలతో ప్రతిష్ఠాపన చేశారు.

గమ్యం చేరని ఆర్టీసీ బస్సులు

- ప్రయాణ ప్రాంగణం చేరాలంటే ఆటోలే..
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



పాతబస్టాండ్‌లో నిలిచిపోయిన ఆర్టీసీ బస్సులు

అయిజ: పట్టణంలోని పాత బస్టాండ్ కొత్త బస్టాండ్ మధ్యనున్న పెద్దవాగుపై వంతెన నిర్మాణం చేపట్టినప్పటి నుంచి ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేసేవారికి కష్టాలు ప్రారంభమయ్యాయి. పాత పట్టణం, కొత్త పట్టణమని అయిజ రెండు భాగాలుగా విభజించారు. కొత్త బస్టాండ్, పాత బస్టాండ్ మధ్యన పెద్దవాగుపై గతంలో నిర్మించిన పాత వంతెనకు ఇటువైపు ఉన్న ప్రాంతాన్ని పాత పట్టణమని, అటువైపు కొత్త పట్టమని పిలువబడుతోంది. పాత వంతెనను కూలగొట్టినప్పటినుంచి గద్వాల డిపోనుంచి గద్వాల–అయిజకు తిరుగుతున్న ఆర్టీసీ బస్సులు కొత్త బస్టాండ్‌లో ఆర్టీసీ ప్రాంగణానికి రావడం లేదు. దాని వల్ల కొత్త బస్టాండ్ చేరాల్సిన ప్రయాణికులు పాతబస్టాండ్‌లోనే బస్సు దిగాల్సి వస్తోంది. అక్కడ నుంచి కొత్త బస్టాండ్ ఆర్టీసీ ప్రాంగణం చేరుకోవడానికి ఆటో రిక్షాలో ఒక్కొక్క మనిషికి రూ. 20 చెల్లించాల్సి ఉంటుంది. ఒక్కరు మాత్రమే వెళ్లాల్సి వస్తే రూ.30 డిమాండ్ చేస్తున్నారు. అధికారులు, పాలకులు దృష్టిసారించి ప్రయాణికుల ఇబ్బందులను తొలగించాలని కోరుతున్నారు.



బ్రిడ్జిపై నుంచి వెళ్తున్న ప్రయాణికులు

డైవర్షన్ రోడ్డు బాగలేదు..



అయిజ–గద్వాలకు ఆర్టీసీ బస్టాండ్ నుంచి ప్రైవేట్ బస్సులు నడిపిస్తున్నాం. గతంలో ప్రైవేట్ బస్సుల యజమానులు, డ్రైవర్లతో ఒప్పందం చేసుకున్నారు. కొన్ని రోజులు డైవర్షన్ రోడ్డుపై బస్సులు నడుపలేమని చెప్పారు. డైవర్షన్ రోడ్డు గుంతలుగా ఉండడంతో బస్సులు వెళ్లడం లేదు. ప్రైవేటు బస్సుల యజమానులు ఒప్పుకోవడం లేదు. బ్రిడ్జి నిర్మాణం పూర్తయితేనే సమస్య పరిష్కారం అవుతుంది.

– మంజులరెడ్డి, ఆర్టీసీ డీఎం

ప్రయాణికులకు ఇబ్బందులు..



బ్రిడ్జి కూల్చేసినప్పటి నుంచి ప్రయాణికులు ఇబ్బందులకు గు రవుతున్నారు. ఆర్టీసీ బస్సులు కొత్త బస్టాండ్‌కు చేరుకోవడంలే దు. పాతబస్టాండ్‌లోనే ప్రయాణికులను దింపడంతో ఆటోల్లో కొత్త బస్టాండ్ చేరుకోవాల్సి వస్తోంది. దాని వల్ల ప్రయాణికులు ఆర్థికంగా నష్టపోతున్నారు.

– మహేష్, అయిజ

వంతెన పనులు పూర్తి చేయాలి



ప్రయాణికుల సమస్యలకు ప్రధాన కారణం బ్రిడ్జి నిర్మాణం పూర్తి కాకపోవడమే. గతేడాడి పాత బస్టాండ్–కొత్త బస్టాండ్ మధ్యనున్న పాత బ్రిడ్జిని కూల్చేశారు. ఇప్పటి వరకు పనులు పూర్తి కాలేదు. బ్రిడ్జి నిర్మాణం పూర్తయినా, అప్రోచ్ రోడ్డు నిర్మాణం పూర్తికాకపోవడంతో బస్సులు పాతబస్టాండ్ వద్దనే నిలిచిపోతున్నాయి. దాని వల్ల ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు.

– మహబూబ్ బాషా, అయిజ

అధికారులు స్పందించాలి



పాత వంతెనను కూల్చినప్పటి నుంచి ప్రజలు ఇబ్బందులు పడుతున్న అధికారులకు చీమకుట్టినట్టు కూడా లేదు. డబ్బు పెట్టుకోలేని పేదలు కాలినడకన వెళ్లాల్సివస్తోంది. ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి ప్రజల సమస్యను పరిష్కరించాలి.

– వెంకటేష్, అయిజ

కాంగ్రెస్ ఐదు గ్యారంటీ కార్డుల విడుదల



ఐదు గ్యారంటీ కార్డులను విడుదల చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

గద్వాల అర్బన్: కాంగ్రెస్ పార్టీ ద్వారానే ప్రజలకు మేలు జరుగుతుందని ఆ పార్టీ సీనియర్ నాయకుడు శంకర్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు నల్లారెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని గంజిపేటలో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పాంచ్ న్యాయ్ పేరుతో కాంగ్రెస్ ప్రకటించిన అయిదు గ్యారంటీల హామీ కార్డులను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో భారతదేశంలో ఇండియా కూటమి గెలుపు ఖాయమన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి మల్లురవిని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఇసాక్, 14,15వ వార్డు కాంగ్రెస్ నాయకులు బంగి సుదర్శన్, దినేష్, జహంగీర్, రాము, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు వెంకటేష్ ఉన్నారు.

తాటికుంట రోడ్డుకు మరమ్మతు చేపట్టాలి



మల్దకల్: మండలంలోని తాటికుంట స్టేజీ నుంచి తప్పెట్లమొర్సు గ్రామం మధ్యన ఉన్న బీటీ రహదారిపై ఏర్పడిన గుంతలకు మరమ్మతు చేపట్టాలని వాహనదారులు మల్దకల్, రాముడు, కిష్టన్న, వెంకటన్నలు కోరారు. నిత్యం ఈ రహదారిపై వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. 8 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఈ బీటీ రోడ్డుపై ఏర్పడిన గుంతలకు ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లపై ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



త్రైత సిద్ధాంత భగవద్గీత పుస్తకాలను ప్రదర్శిస్తున్న బింగిదొడ్డి కమిటీ సభ్యులు

శాంతినగర్: జీవాత్మ, ఆత్మ, పరమాత్మ మూడు ఆత్మల వివరాలు తెలుసుకోవాలంటే త్రైత సిద్ధాంత భగవద్గీత చదవాలని ప్రబోధానంద జ్ఞాన వేదిక బింగిదొడ్డి కమిటీ అధ్యక్షుడు లక్ష్మణ్ అన్నారు. వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని శాంతినగర్‌లో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీత గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్రిమత ఏకైక గురువు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు గ్రహీత ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత పుస్తకాలను చదవాలని పట్టణ ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సభ్యులు ఈరన్న, వెంకటేష్, రామచంద్ర, జయమ్మ, నరసమ్మ, పద్మమ్మ, జమ్ములమ్మలు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

గట్టు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం ఎంపీపీ విజయ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చెన్నయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10:30 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, అన్ని శాఖల అధికారులు సర్వసభ్య సమావేశానికి తప్పక హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

అవగాహన కల్పిస్తున్న పోలీస్ కళాబృందం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ విజయభాస్కర్

అయిజ: మండలంలోని ఉప్పల క్యాంపులో శనివారం రాత్రి ఎస్ఐ విజయభాస్కర్ ప్రజలకు పోలీస్ కళాబృందం ద్వారా పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌లో ఏడేళ్ల లేదా అంతకంటే తక్కువ కాలం శిక్షలు పడి ఐపీసీ కేసులలో, స్పెషల్ లా కేసులలో సుప్రీం కోర్టు గైడ్ లైన్స్ ప్రకారం మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచకుండా పోలీస్ అధికారుల ద్వారానే ఆయా కేసులలోని నిందితులకు నోటీసులు అందజేయడం జరుగుతుందన్నారు. వాటిని నిందితులు తప్పకుండా అందుకోవాలన్నారు. నోటీసులను నిందితులకు ఇంట దగ్గర లేదా పోలీస్ స్టేషన్‌లో అందజేస్తామని, దూర ప్రాంతాల్లో ఉన్న వారికి రిజిస్టర్ పోస్టు ద్వారా అందజేస్తామన్నారు. నిందితులు నోటీసులో పేర్కొన్న సూచనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. అనంతరం పోలీస్ కళా బృందం ద్వారా బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ వల్ల నష్టాలు, విద్యా ప్రాధాన్యతపై పాటల రూపంలో ప్రజలను చైతన్యం చేశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, కళా బృందం సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పశువైద్య కేంద్రానికి మరమ్మతు చేపట్టాలి



మల్దకల్: మండలంలోని బిజ్వారం పశువైద్య కేంద్రానికి మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. 19 ఏళ్ల క్రితం నిర్మించిన పశువైద్య కేంద్రం శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు కూలి ఏ ప్రమాదం జరుగుతుందోనని పశువైద్యసిబ్బంది ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పశువైద్య కేంద్రానికి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

మూలమలుపులతో ప్రమాదాలు



చెన్నిపాడు వద్ద సూచికలు లేని మూలమలుపు

మానవపాడు: మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారుల్లో మూలమలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని మండల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని చెన్నిపాడు, గోకులపాడు, మానవపాడు ప్రధాన కాల్వ వద్ద ఉన్న మూలమలుపు, చండూరు, పల్లెపాడు, నారాయణపురం, అమరవాయికు వెళ్లే ప్రధాన రహదారుల వెంట మూలమలుపులున్నాయి. మూల మాలుపుల వద్ద హెచ్చరికలు, సూచికబోర్డులు ఉండాలి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

డ్రెయినేజీ నిర్మించండి

అయిజ: పట్టణంలోని మడ్డి గుంత కాలనీలో డ్రెయినేజీలు, సీసీ రోడ్లు నిర్మించకపోవడంతో కాలనీ మొత్తం దుర్వాసన వెదజల్లుతోంది. కాలనీలో అటువైపు వెళ్లేవారు ముక్కు మూ సుకొని పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పారిశుద్ధ్యం లోపించడంతో దోమలు ఉధృతి చెంది ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారు. మడ్డి గుంత కాలనీలో సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మించాలని కాలనీ ప్రజలు ఎన్నిసార్లు కోరినా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడంలేదని ప్రజలు వాపోతున్నారు.



నేటి నుంచి ఊరడమ్మమాత జాతర

దామరగిద్ద: మండలంలోని మద్దెల్‌బీడ్ గ్రామంలో వెలసిన ఊరడమ్మ మాత జాతర ఉత్సవాలు సోమవారం నుంచి మూడు రోజులపాటు వైభవంగా నిర్వహించనున్నారు. జాతర ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక భజనలతో ప్రారంభిస్తారు. మంగళవారం మంగళ వాయిద్యాలతో గ్రామ పురవీధుల గుండా పల్లకిసేవ నిర్వహిస్తారు. అనంతరం గ్రామ సివారులోని పెదబావి నుంచి జల్దిబిందే ఉత్సవాలు, సాయంత్రం సామూహిక బోనాలు నిర్వహిస్తారు. మహిళలు ప్రత్యేక వంటకాలతో తయారుచేసిన నైవేద్యాలను అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బుధవారం తెల్లవారుజాము నుంచి రెట్టపట్లు కార్యక్రమం చేపట్టనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

సత్తాచాటిన గురుకులాల విద్యార్థులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఉమ్మడి పాలమూరు జిల్లా పరిధిలోని గురుకుల కళాశాలల విద్యార్థులు సత్తాచాటారు. ఇందులో ఎస్సీ గురుకుల కళాశాలలకు సంబంధించి మొదటి సంవత్సరంలో జిల్లాల వారీగా గద్వాలలో 72.21 శాతం ఉత్తీర్ణత సాధించారు. వనపర్తిలో 72.21, నాగర్‌కర్నూల్‌లో 73.4, మహబూబ్‌నగర్‌లో 80.89 శాతం, నారాయణపేటలో 77.92 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు. రెండో సంవత్సరంలో వనపర్తి 83.28 శాతం, నాగర్‌కర్నూల్ 81 శాతం, మహబూబ్‌నగర్ 91 శాతం, గద్వాల 76.1, నారాయణపేట 82.3 శాతం నమోదైంది.

- ఎస్టీ గురుకులాల్లో మొదటి సంవత్సరంలో గద్వాల 71.43 శాతం, వపపర్తి 95.38, మహబూబ్‌నగర్ 73.02, నాగర్‌కర్నూల్ 72.09, నారాయణపేట 71.63 శాతం సాధించారు. అలాగే ద్వితీయ సంవత్సరంలో గద్వాల 84.21, వనపర్తి 94.67, నాగర్‌కర్నూల్ 85.85, మహబూబ్‌నగర్ 83.33, నారాయణపేట 91.67 శాతం ఉత్తీర్ణత నమోదైంది.
- టీఎస్ఆర్‌జేసీ కళాశాలల్లో మొదటి సంవత్సరంలో గద్వాల 89.33, మహబూబ్‌నగర్ 97.53, రెండో సంవత్సరంలో గద్వాల 92.65, మహబూబ్‌నగర్ 98.8 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు. వనపర్తి, నారాయణపేట, నాగర్‌కర్నూల్‌లో కళాశాలలు లేవు.
- మోడల్ స్కూళ్లలో మొదటి సంవత్సరం వనపర్తిలో 50.17, నాగర్‌కర్నూల్‌లో 38.07, మహబూబ్‌నగర్‌లో 50, నారాయణపేటలో 47.2 శాతం ఉంది. రెండో సంవత్సరంలో వనపర్తిలో 69.6, నాగర్‌కర్నూల్‌లో 55.34, మహబూబ్‌నగర్‌లో 69.6, నారాయణపేటలో 46.86 శాతం ఉత్తీర్ణత సాధించగా గద్వాలలో కళాశాల లేదు.
- కేజీబీవీల్లో మొదటి సంవత్సరంలో గద్వాల 73.84, వనపర్తిలో 74.2, నాగర్‌కర్నూల్‌లో 63.77, మహబూబ్‌నగర్‌లో 76.45, నారాయణపేటలో 72.59 శాతం ఉత్తీర్ణత నమోదైంది. రెండో సంవత్సరంలో గద్వాలలో 83.9, వనపర్తి 83.3, నాగర్‌కర్నూల్ 75.58, మహబూబ్‌నగర్‌లో 85.84, నారాయణపేటలో 76.29 శాతం ఉత్తీర్ణత వచ్చింది.
- మైనార్టీ గురుకులాల్లో మొదటి సంవత్సరంలో గద్వాల 83.87, వనపర్తిలో 73.21, నాగర్‌కర్నూల్‌లో 60.32, మహబూబ్‌నగర్‌లో 73.57, నారాయణపేటలో 75 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా.. రెండో సంవత్సరంలో గద్వాల 88.7, వనపర్తిలో 82.86, నాగర్‌కర్నూల్‌లో 85.25, మహబూబ్‌నగర్‌లో 86.6, నారాయణపేటలో 87.78 శాతం ఉత్తీర్ణత వచ్చింది.
- ప్రభుత్వ కళాశాలల్లో మొదటి సంవత్సరంలో గద్వాల 47.65 శాతం, వనపర్తిలో 35.68, నాగర్‌కర్నూల్‌లో 34.35, మహబూబ్‌నగర్‌లో 42.08, నారాయణపేటలో అత్యల్పంగా 29.61 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఇక రెండో సంవత్సరంలో గద్వాల 59.96, వనపర్తి 51.4, నాగర్‌కర్నూల్‌లో 49.8, మహబూబ్‌నగర్‌లో 50.94, నారాయణపేట 41.23 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు.
- బీసీ గురుకులాల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో గద్వాల 88.35 శాతం, వనపర్తి 77.6, నాగర్‌కర్నూల్ 74.73, మహబూబ్‌నగర్ 72.44, నారాయణపేట 64.41 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు. రెండో సంవత్సరంలో గద్వాలలో 93.44, వనపర్తిలో 84.97, నాగర్‌కర్నూల్‌లో 88.39, మహబూబ్‌నగర్‌లో 91.8, నారాయణపేటలో అత్యధికంగా 96 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

ప్రీమియర్ లీగ్ విజేతగా నోబెల్ కింగ్స్



లీగ్ విజేత జట్టుకు బహుమతి అందజేసిన జెడ్పీటీసీ శ్యామల

గట్టు: మండలంలోని బల్గెర గ్రామంలో నిర్వహిస్తున్న దిగంబరస్వామి జాతర సందర్భంగా నిర్వహించిన ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ విజేతగా నోబెల్ కింగ్స్ జట్టు గెలుపొందింది. ఆదివారం విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రీమియర్ లీగ్ విజేతగా నోబెల్ జట్టుకు దాత జెడ్పీటీసీ బాసు శ్యామల రూ.40 వేలు అందజేశారు. ద్వితీయ బహుమతి దాత ఎంపీటీసీ రూపవతి కిష్టప్ప రూ.20 వేలు శివాజీ కింగ్స్ జట్టు దక్కించుకుంది. తృతీయ బహుమతి దాత బాసు నాయుడు రూ.10 వేలు పంచముఖి ట్రిక్స్ జట్టు అందుకుంది. విజేతలకు నగదు బహుమతులు జెడ్పీటీసీ బాసు శ్యామల, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు హనుమంతునాయుడులు అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ బాసు శ్యామల మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న విజయంలో ఎంతో తృప్తి ఉంటుందన్నారు. ప్రతి జట్టులోని క్రీడాకారుడు గెలుపు కోసం చివరి దాకా పోరాటం చేయాలన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో వ్యవహరించాలన్నారు. 11 రోజుల పాటు ప్రీమియర్ లీగ్ పోటీలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రూపవతి, నాయకులు బాసునాయుడు, బాసు గోపాల్, పటేల్ రాజు, పోగాకు ఈరన్న, డీఆర్‌నాయుడు, వీరారెడ్డి, ఈరన్న, బుగ్గల్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ఇంటింటి ప్రచారం

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని జూలెకల్‌లో బీజేపీ చేపట్టిన వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను వివరిస్తూ ఆదివారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. మండల అధ్యక్షుడు నరసింహ ఆధ్వర్యంలో కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: భారతదేశం అభివృద్ధి కావాలంటే మళ్లీ మోదీ పీఎం కావాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కేకే రెడ్డి అన్నారు. ఎర్రవల్లి మండలం లోని కోదండాపురంలో బీజేపీ మండలాధ్యక్షుడు జగదీష్ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా 34, 35 పోలింగ్ బూత్‌ల అధ్యక్షులతో కలిసి ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు.



పాగుంటలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో బీజేపీ నాయకులు

కేటీదొడ్డి: పార్లమెంట్ ఎన్నికల్లో మూడోసారి మోదీ ప్రధాని కావడం ఖాయమని బీజేపీ సీనియర్ నాయకుడు బల్గెర శివారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పాగుంటలో ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు హన్మిరెడ్డి, నాయకులు ఉన్నారు.

ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

- పోలీసుల ముందస్తు చర్యలు
- మద్యం విక్రయాలపై ప్రత్యేక నిఘా



నందిన్నె చెక్‌పోస్టు వద్ద నగదు పట్టుకున్న ఎస్ఐ శ్రీనివాస్‌రావు

కేటీదొడ్డి: ఎన్నికలు అంటేనే ఒకరిపై మరొకరు ఆరోపణలు చేసుకోవడం సాధారణం. తమ పార్టీ అభ్యర్థులే గెలవాలనే తపన అందరిలో ఉంటుంది. అలాంటి సమయంలో అనేక తగవులు జరిగే అవకాశాలు అధికంగా ఉంటాయి. మే 13న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు. కోడ్ వచ్చిన నాటి నుంచి వివిధ శాఖల అధికారులు గ్రామాల్లో తగవులు చోటుచేసుకోకుండా అనేక చర్యలు తీసుకుంటున్నారు. ఎన్నికల నిర్వహణకు పోలింగ్ స్టేషన్‌లో మౌలిక సౌకర్యాల కల్పనకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఓటర్లను ప్రభావితం చేసే వాటిపై నిఘా..

ఎన్నికల సమయంలో అనేక మంది నాయకులు తమ పార్టీ నాయకులకు ఓట్లు వేసేందుకు అనేక విధాలుగా ప్రయత్నిస్తుంటారు. అందులో గోడలపై అనేక వాగ్దానాలతో కూడిన రాతలు రాయకుండా చర్యలు తీసుకుంటున్నారు. గతంలో ఎవరైన రాసి ఉంటే వాటిని తొలగించడంతో పాటు పార్టీల జెండాలకు, నాయకుల విగ్రహాలకు ముసుగులు తగిలించారు. వాటితో పాటు ఏ గ్రామంలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు చేపట్టవద్దని నాయకులు, ప్రజాప్రతినిధులకు సూచిస్తున్నారు.

మద్యం విక్రయాలపై ప్రత్యేక దృష్టి..

ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు మద్యం విక్రయాలు నిషేధించాలని అధికారులు నిర్ణయించారు. అనుకున్నదే తరువుగా గతంలో బెల్టు షాపుల ద్వారా మద్యం విక్రయించే వారిని పిలిపించి విక్రయించకుండా కౌన్సిలింగ్ ఇచ్చారు. దీంతో పాటు పలువురిని తహసీల్దార్ కార్యాలయంలో బైండోవర్ చేసి మద్యం విక్రయిస్తే పీడీ యాక్ట్ కేసు నమోదుతో పాటు రూ.2లక్షల జరిమాన విధించినట్లు హెచ్చరించారు. మద్యం దుకాణాల యాజమానులు ఒక వ్యక్తికి ఎంత మద్యం అవసరమో అంతే విక్రయించాలని, అధిక మొత్తంలో విక్రయించిన వ్యక్తికి విధిగా బిల్లు ఇవ్వాలని ఆదేశించారు.

పాత నేరస్తులపై పర్యవేక్షణ..

ఎన్నికల సమయంలో తగాదాలకు సిద్ధపడే పాత నేరస్తులపై పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టారు. వారందరిని స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇవ్వడంతో పాటు వారిని తహసీల్దార్ కార్యాలయంలో బైండోవర్ చేస్తున్నారు. పోలీసులు పిలిచిన సమయంలో స్టేషన్‌కు వచ్చి వెళ్లాలని, ఎలాంటి సంఘటనలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గతంలో దాడులకు పాల్పడిన అనేక మంది మళ్లీ అలాంటి సంఘటనలు పాల్పడకుండా ఉండేందుకు జాగ్రత్త పడుతున్నారని, ఎన్నికలలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ఎన్నికల సందర్భంగా విధించిన నిబంధనలను ఏ ఒక్కరు అతిక్రమించినా చట్టపరమైన చర్యలు తప్పవని, ఇప్పటికే అనేక మందికి కౌన్సిలింగ్ ఇచ్చాం. గ్రామాల్లో బెల్టు దుకాణాల ద్వారా మద్యం విక్రయించొద్దని సూచించాం. ఎవరైనా విక్రయిస్తే పీడీ యాక్ట్ కేసు నమోదు చేస్తాం.

– ఎస్ఐ శ్రీనివాస్‌రావు, కేటీదొడ్డి